# సరయు - రవికాంత్

శ్రీ భరణు

కారు పోర్టికోలో ఆగింది. సరయు గబగబా మెట్లెక్కి గదిలోకి వెళ్ళి కిటికీలో గుండా తొంగిచూచింది. కారులో కూర్చున్న రవికాంత్ చేయి ఊపాడు. సరయుకూడా చేయి ఊపింది. కారు కదిలింది. కనుచూపు దాటేంతవరకు కారును చూస్తూ నిలబడింది.

పుస్తకాలు బీరువాలో పెట్టింది. ఏం చేయాలి అని ఒక్క క్షణంపాటు ఆలోచిస్తూ నిలబడింది. రవికాంత్ మళ్లా వస్తానని చెప్పలేదు - తను అడగటం మరిచింది. డ్రెస్ చేసుకొని క్లబ్బుకు పోవాలనిపించింది. నిలువుటద్దం ముందు నిలబడి ఆపాద మస్తకంగా పరీక్షించుకొంది. నీలిరంగు చీర తన వంటికి యెంతో అందంగా వున్నట్టనిపించింది. అవును–అందంగానే ఉంది. రవికాంత్‌కి నచ్చింది–మళ్లీ మళ్లీ చూచుకొని మురిసిపోయింది. ఎన్నడూలేని ఆనందం ఈ నాడు కలుగుతోంది. అర్థంకావటంలేదు. ముప్పాతిక భాగం పూర్తిచేసి వదిలేసిన "భగ్నజీవి" నవల గుర్తుకొచ్చింది. కథానాయకి చిన్నప్పుడు యెన్నో కష్టాలుపడి ఒక యువకుడ్ని ప్రేమిస్తుంది. ఆ యువకుడు మోసంచేస్తాడు. తొలిసారి యువకుడ్ని కలుసుకొన్నప్పుడు కథానాయకి మాటలు స్ఫురణకు వచ్చినయ్. "ఎన్నడూలేని ఆనందం ఈ నాడు ... అంధకారంపోయి వెలుగువస్తున్నప్పుడుండే సంతోషం ... చందమామ ముందున్న కారుమబ్బులు తేలిపోతుంటే కనుపించే నవ్యత. భావి జీవితం క్రొత్త దారులు త్రొక్కబోతుంటే ఏహృదయం ఉప్పొంగిపోదు ..." కథానాయికి నిలువుటద్దం ముందు నిలబడి ఎన్నెన్నో కలలు కంటుంది. చివరకు ఆశలన్ని అడియాశలవుతాయి. గడియారం అయిదుకొట్టింది. ఉలిక్కిపడింది సరయు. చాలా సేపయింది నిలువుటద్దం ముందు నిలబడి "నా కోసం ఎవరన్నా వస్తే క్లబ్బుకు రమ్మను" అని పనివాడికి చెప్పివెళ్లింది సరయు.

♦ ♦ ♦

సరయుని ఇంటి దగ్గర దిగపెట్టి యింటికి వచ్చాడు. కారు రోడ్డుమీద ఆపి యింట్లోకి వెళ్ళాడు. మేడమీద గదిలోకివెళ్లి, చేతిలోని పుస్తకాలు టేబిల్‌మీదపారేసి, కోటు స్టాండ్‌కి తగిలించి, సిగిరెట్టు వెలిగించాడు. ప్రొద్దున కాలేజికి వెళ్ళేముందు డ్రెస్ చేసుకొన్నాడు. దుస్తులు కొద్దిగా నలిగినయ్. నిలువుటద్దం ముందు నిలబడి ఓ సారి చూచుకొందాం అని అను

కొన్నాడు. సిగిరెట్టు పెదిమెలతో నొక్కి పట్టుకొని చేతులు పాంట్ జేబులో పెట్టుకొని అద్దంముందు నిలబడ్డాడు.

చొక్కా నలిగిపోయింది. జుట్టు నుదిట మీద పడ్తోంది. టాయిలెట్ చేసుకొంటే బాగుండుననిపించింది. టాయిలెట్ లేకుండా వుంటేనే సరయుకు నచ్చుతుంది. సరయు ... సరయు ... ఆ పేరులో ఎంతో మృదుత్వంవుంది. శ్రావ్యంగా వుంది. అందంగాకూడాఉంది. చదువూ ఐశ్వర్యం రెండూవున్నవాళ్లు అరుదుగా కనిపిస్తారు. సరయు ఆశాజ్యోతి, భావి జీవితపు భాగ్య రేఖ ... జీవిత సారభం ... సర్వస్వం ... అంధకార జీవితానికి మెరుపుతీగె. చదువుకొన్నవాళ్లు అప్రమత్తతతో మెలుగుతారు. జీవిత నౌకను సాఫీగా నడుపుకొంటారు. సిగిరెట్టు చివరిదాకా కాలింది. వేలు చుఱ్ఱుమన్నది. చాలాసేపయింది. కాఫీ సేవించి ఫాన్సీబుష్‌కోట్ తొడుక్కొని ... యెక్కడికి వెళ్లుదామని ఆలోచించాడు. టెన్నిస్ ఆడుకుంటే బాగుండుననిపించింది మొదట ... కాదు "మాడామ్ బవేరీ" ఆఖరురోజు ... సరయుని తీసుకువెళ్తే బాగుండుననిపించింది. అవును సరయు చూడాల్సిన పిక్చర్ అది.

◆ ◆ ◆

పోర్టికోలో కారు ఆపి సరయు గది లోకి వెళ్ళాడు. అది చాల విశాలమైన గది. ఫ్లవర్ వాజ్‌లు, చిత్రలేఖన ఫోటోలు, దంతపు శిల్ప ప్రతిమలు అందంగా అమర్చబడినయ్. ఓ మూల బీరువాలో పుస్తకాలు వరుసగా అమర్చబడినయ్. చదువుకునే టేబిల్ మీద సరయు ఫోటో వుంది. ఫోటోముందు నిలబడి...దీర్ఘంగా చూశాడు. సరయు మొహంలో అనంత కోటి అనుభూతులు ప్రస్ఫుటమవుతున్నయ్. ఫోటో చేతిలోకి తీసుకొని చూచాడు. ఫ్రేముకి వెనకవైపు 'తన' ఫోటోఉంది. ఆశ్చర్యమనిపించింది. తనకి తెలియకుండానే ఫోటో సంపాదించుకొంది. ఎన్నాళ్లనుండి తనని ప్రేమిస్తున్నదో ... అనుకొన్నాడు. రహస్యంగా ప్రేమిస్తున్నదా! ఏమో అయితే కావచ్చు. సరయు మనసు నిర్మలమైనది. పవిత్రప్రేమ అంటే సరయుదే!

రెండు క్షణాల తరువాత పనివాడు పైకి వచ్చి "అమ్మగారు క్లబ్బుకి రమ్మన్నారు."

"ఎవర్ని?"

"మిమ్మల్ని రమ్మన్నారు .. ముందుగా చెప్పటం మరచిపోయారట"

"సరే" చేతిగడియారంలో ఆరు దాటింది. సినిమావేళ అయిపోయింది. కాసేపు కూర్చోని పోవాలననిపించింది. పనివాడు కిందికి వెళ్లిపోయాడు. బీరువాలోని పుస్తకాలు రవికాంత్‌ను ఆకర్షించి

నయ్. ఒక్కొక్క పుస్తకంతీసి చూస్తున్నాడు. నవలలు . . వైజ్ఞానిక పుస్తకాలు, నాటకాలు, తెలుగు ఇంగ్లీషు పుస్తకాలు . . చక్కని గ్రంథాలు. మూలగా నక్కివున్న నల్లఅట్టల పుస్తకం చూడాలనిపించింది. పుస్తకంలాగి పుటలు త్రిప్పాడు. రెండుకాగితాలు క్రిందపడ్డాయి. కాగితాలుతీసిచూశాడు. అవి రెండూ ఉత్తరాలు.

బెంగుళూరు
13-11-1950

ప్రియ సరయు,

నువ్వు వెళ్లేప్పుడు నాకు చెప్పకుండా వెళ్ళావు. ఆశ్చర్యమనిపించింది. మూడు సంవత్సరాలుగా యేర్పడ్డ స్నేహఫలితంగా, ... చివరకు వివాహం చేసుకొందాం అని నిర్ణయించుకొన్నాము. నాకు ఆస్తిపాస్తులు లేవు. ఆ సంగతి నీకు తెలుసుననుకొన్నాను. నీ మీద నా భవిష్యత్తు నిర్మించుకొన్నాను. నిన్ను ప్రేమించటంవలన నా వాళ్లకు దూరమైనాను. ఇంతకుమునువు ఎన్నో ఉత్తరాలువ్రాశాను. ఏకాకిగా నన్ను వదిలేసి, నాభవిష్యత్తు నిర్మూలంచేయటం .. నీకు తగనిపని.

ఈ ఉత్తరంచూచిన వెంటనే బయలుదేరి వచ్చెయ్యి.

ఇట్లు
"నీ ప్రియ మధు"

ఆత్రుతతో రెండో ఉత్తరం చూశాడు. అది సరయు వ్రాసిన ఉత్తరం – అని నిర్ధారణ చేసుకొన్నాడు.

హైద్రాబాదు
13.12.1950

మిస్టర్ మధు!

నువ్వు వ్రాసిన ఉత్తరం చదివిన మీదట నిన్ను గురించి ఏమనుకోవాలో తెలియటంలేదు. మూడు సంవత్సరాలు పాటు స్నేహితులుగా ఉన్నమాట నిజమే. నిన్ను తప్పక వివాహం చేసుకొంటానని నేను అనలేదు. అనుకోవటం నీ పొరబాటు. ఇకనుంచి నువ్వు ఈలాంటి ఉత్తరాలు వ్రాయటం మానివెయ్యాలి.

ఈ రోజు నేను నాబస మారుస్తున్నాను. అడ్రెసు నీకు అనవసరం.

ఇట్లు
ప్రియసఖి సరయు

రెండుత్తరాలు రెండు సార్లు చదివాడు. సరయు ఇంతమటుకూ ఈ విషయాలు తనకెందుకు చెప్పలేదు? చెవుతే ... ఏమవుతుందో తనకి తెలుసు. అందుకే చెప్పలేదు గబగబా టేబిల్ దగ్గరికెళ్ళి కాగితం తీసుకొని రెండు ముక్కలువ్రాసి, 'తన' ఫోటో ఫ్రేములో నుండి తీసుకొని నిష్క్రమించాడు.

◆ ◆ ◆

రాత్రి ఆలశ్యంగా సరయు ఇంటికి

వచ్చింది. పనివాడ్ని అడిగి రవికాంత్ వచ్చి వెళ్లినట్టుగా తెలుసుకొంది. రవికాంత్ క్లబ్బుకి ఎందుకు రాలేదో అర్థం కాలేదు. కూని రాగాలు తీసుకొంటూ గదిలోకి ప్రవేశించింది. నిలువుటద్దం ముందు నిలబడింది. టేబిల్ దగ్గరకి పోయి ఫోటో చూసింది. ఆశ్చర్య మనిపించింది. రవికాంత్ ఫోటో లేదు. రెండు నిమిషాలు నివ్వెర పోయింది. టేబుల్ మీద నున్న కాగితం విప్పి చదివింది. ధోరణి అర్థం కాలేదు మళ్ళ చదివింది...

హైద్రాబాదు
11–2–1958

మిస్ సరయు

ఈ రోజుసాయంత్రం నీ గదికి వచ్చాను. సినీమాకి తీసుకెళ్లుదామనుకున్నాను. నువ్వు లేవు. ఊసుపోక కాసేపు కూర్చున్నాను. బీరువాలోని పుస్తకాలు చూచాను. కొన్ని ఉత్తరాలు కనిపించినయ్. నీ అనుమతి లేకుండా చదివాను. క్షంతవ్యుడను. నీ సంగతి పూర్తిగా తెలుసుకొన్నాను. నీ పూర్వ వృత్తాంతమంతా బోధపడింది. అవన్నీ వ్రాయటం అనవసరం. నన్ను మరిచిపో.

శెలవు
రవికాంత్

ఇంత గంభీర భావంతో వ్రాసిన ఉత్తరం చూచి కిల కిలా నవ్వింది. ఎంతనవ్వినా తృప్తికనిపించలేదు. రాత్రి పదిగంటలైంది. పాపం రవికాంత్ కి నిద్రపట్టదు–తనని గురించి ఏమాలోచిస్తాడో ఊహించుకుంటు కూర్చుంది. భోజనంచేసి టాక్సీ పిలిపించింది. బీరువాలోని ఉత్తరాలు; మూలల్లో నక్కివున్న, సగం చిరిగిన పుస్తకం తీసుకొని, రవికాంత్ గదికి బయలు దేరింది.

టాక్సీ ఆపి రవికాంత్ గదిలోకెళ్ళి తలుపు కొట్టింది. చెదిరిపోయిన జుట్టు, చింతనిప్పుల్లాగానున్న కళ్లతో పళ్ళుబిగపట్టి క్రిందకి వచ్చాడు. సరయుని చూచి దూరంగా నిలబడ్డాడు.

'నువ్వెందుకు వచ్చావు?'
"నిన్ను పరామర్శించటానికి'
'అర్థరాత్రి వేళ?'
'అవును. ఇది మంచి సమయం'
'నీకూ .... నాకు సంబంధం లేదు'
'ఉన్నది'
'లేదు'

'నన్ను ప్రేమించావు. ఆశలు కల్పించావు. యిప్పుడు నన్ను వొంటరిగా వదిలివేయటం నీలాంటి పెద్ద మనుషులకు, విద్యావంతులకు తగని పని. నిన్ను ప్రేమించాను. నీ నీడన బ్రతుకుదామనుకొన్నాను. ఇప్పుడు కాదని త్రోసివేయటానికి వీలులేదు."

''సరయు ... నువ్వు ఉపన్యాసాలతోనూ, కబుర్లతోనూ, నన్ను బోల్తా కొట్టించ ప్రయత్నించకు. నేను నీ ప్రియ మధును కాను సుమా!''

''మధు యెవరు ?''

''ఓహో! తెలియదు కాబోలు నిన్ను ప్రేమించి .... మోసపోయినవాడు, నీకు ప్రేమ లేఖలు వ్రాసిన వాడు.''

''చాలా బాగుంది'' ... అని కిలకిలా నవ్వింది. ఆ నవ్వుకు రవికాంత్ మతి పోయింది.

''మిస్టర్ రవికాంత్ - ఆ ఉత్తరాలు నిజమైన ఉత్తరాలు కావు. నేను వ్రాసిన ''భగ్నజీవి'' నవలలోని కాగితాలు అవి. ఈ వ్రాత ప్రతి చూడు అంతా తెలుస్తుంది. కథా నాయికకి నా పేరు ఉంచటంచే నువ్వు పొరపాటు పడ్డావు. రెండు ఉత్తరాలు ఒకే దస్తూరిలో ఉండటం కూడా గమనించలేదు ...''

వ్రాత ప్రతి చేతికిచ్చింది. వ్రాత ప్రతి ఉత్తరాలతో పోల్చి చూచాడు. నాలుక కొరుక్కున్నాడు.

''క్షమించు సరయు''

''అంత మాట అనకు .... యికనుంచి ఉత్తరాల విషయంలో జాగ్రత్తగా ఉంటాను.''

గోడగడియారం పదకొండు కొట్టింది.

''ప్రొద్దు పోయింది...యిక నేవస్తాను. హాయిగా నిద్రపో-రేపు ప్రొద్దున మనిద్దరం కలసి ఫోటో తీయించు కొందాం''

గబగబా వెళ్ళిపోయింది; ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు రవికాంత్.

మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.